క్లుప్తంగా

వెండి కిరీటం ప్రదానం



వెండికిరీటం అందజేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వర స్వామి వారికి వెండి కిరీటంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం భక్తులు బోయ పద్మావతి కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్‌కు కిరీటం అందజేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సంఘం సభ్యులు శ్రీనివాసరాజు, ఆళ్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లు రైలును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కర్నూలు రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షాబీర్‌బాషా, సోమన్న, కుమార్‌రాజు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్ రామకేశవులు (52) అనారోగ్యంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన కర్నూలు మండలం పంచలింగాల చెక్ పోస్టులో విధులు నిర్వహించేవాడు. తీవ్ర అనారోగ్యంతో వారం రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేవాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. రెండు కిడ్నీలు పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. వెల్దుర్తి మండలం పేరువేముల గ్రామానికి చెందిన రామకేశవులు 1995లో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. ప్రస్తుతం కర్నూలులోని సంతోష్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఈయనకు భార్య సువర్ణ, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు సంతానం. శనివారం సుంకేసుల రోడ్డులోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, జగన్నాథం, అయ్యన్నతో పాటు సహోద్యోగులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన మార్కెట్ కమిటీ

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరానికి సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యాలను అధిగమించిందని సెక్రటరీ జయలక్ష్మి శనివారం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలపై ఒక్క శాతం ఫీజు ప్రకారం రూ.7.60 కోట్ల లక్ష్యాన్ని అందుకోవాల్సి ఉండగా.... ఇప్పటికే రూ.7.63 కోట్లు సాధించినట్లు ప్రకటించారు. ఇంకా ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని తెలిపారు.

మహిళలపై నేరాల అదుపులో ప్రభుత్వం విఫలం

కర్నూలు : మహిళలపై జరుగుతున్న నేరాలను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్కూల్ ఆయాల వర్కర్స్ యూనియన్ (ఏపీఏఎస్‌డబ్ల్యూయూ) అధ్యక్షురాలు తేజోవతి అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను బహిర్గతం చేస్తూ కర్నూలు పాతబస్టాండ్ దగ్గర ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలకు ఇచ్చే కనీస జీతం రూ.6 వేలు క్రమం తప్పకుండా చెల్లించాలని, వారికి ఉన్న పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది



ప్రసంగిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు(సిటీ): విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు ప్రైమరీ చదువే పునాది అని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. నగరంలోని హారిజాన్స్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవం పాఠశాల చైర్మన్ ప్రదీప్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ పి.పావని అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ, విశిష్ట అతిథిగా రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య హాజరై మాట్లాడారు. పిల్లలకు చదువే ఆస్తి అని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తాచాటాలి

కర్నూలు (టౌన్) : క్రీడలో పురుషులతో సమానంగా మహిళలు సత్తాచాటాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానిన పురస్కరించుకొని మహిళా జట్లకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రగ్బీ సంఘం అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రవీంద్ర కాలేజీలో విద్యార్థినులతో జేసీ నవ్య, పీపీ సి.సరళాదేవి



కేఎంసీలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ పీఎస్ జిక్కిని సన్మానిస్తున్న వైద్యులు



మార్కెట్ కమిటీలో జయలక్ష్మి, నిర్మలమ్మకు సత్కారం



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ..

పండుగలా...

నగరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

స్త్రీ లేకపోతే జననం లేదు..గమనం లేదు. అసలు సృష్టేలేదు. తల్లిగా,చెల్లిగా, భార్యగా కుటుంబ భారాన్ని మోస్తూ వారు సర్వం త్యాగం చేస్తారు. ఈ నేపథ్యంలో మహిళల దినోత్సవాన్ని శనివారం కర్నూలు నగరంలో పండుగలా నిర్వహించారు. నారీశక్తిని కీర్తిస్తూ పలుచోట్ల ఆటాపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను అభినందించి సత్కరించారు. అవకాశాలు అందిపుచ్చుకుంటూ ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.



ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కోలాటం ప్రదర్శన

కర్నూలు (కల్చరల్/హాస్పిటల్/సిటీ): నగరంలోని విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ పతంజలి సాయినాథ్ యోగా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై ఇంటర్ చదువుతున్న జోన్ విద్యార్థిని హిమరూపిణికి రూ.10 వేలు, చిన్నటేకూరులో నాలుగో తరగతి చదువుతున్న పూజితకు రూ.10 వేలు, కృపా ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు నిత్యావసర సరుకులు, మంచాలు, బట్టలు, ఫుడ్ బ్యాంక్ వారికి క్యారియర్స్ అందించారు.

▶కర్నూలు నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో రాయల మహిళా సంఘం సభ్యులు స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు సంఘం గౌరవాధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నగర అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న, కార్యదర్శి రవికుమార్, నాయకులు సోమశేఖర్, ఈశ్వర్, మహిళా సంఘం నాయకులు సుజాత, సుధావర్షిణి, భారతి, ఆదిలక్ష్మి, బ్రాహ్మణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

▶బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మాలతి అధ్యక్షతన బీఏఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి వక్తగా హాజరై మాట్లాడారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మహిళలందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సీఓఓ సునీల్ సేపూరి, గైనకాలజిస్టు డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ అరుణ, డాక్టర్ శిల్ప, డాక్టర్ కుసుమ, డాక్టర్ సుష్మ, డాక్టర్ శృతి, డాక్టర్ సాహితి, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

▶ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథిగా ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గంగ రత్నమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్లు సావిత్రిబాయి, విమలమ్మ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులరాణి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వినోదిని పాల్గొన్నారు.

▶కర్నూలు మెడికల్ కాలేజీలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మతో పాటు సీనియర్ మహిళా హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ జిక్కి, హెచ్ఓడీలు డాక్టర్ శోభాదేవి, డాక్టర్ అమీరున్నీసాబేగం, డాక్టర్ రాధారాణి, డాక్టర్ విశాల, డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ రూత్ లావణ్య, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ మాధవీశ్యామల పాల్గొన్నారు.

▶జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, ఏవో అరుణ, డీపీఎంఓ డాక్టర్ ఉమాలను సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగినులు పాల్గొన్నారు.

▶నగర శివారులోని జి.పుల్లారెడ్డి దంత వైద్యకళాశాల, హాస్పిటల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవానికి అతిథిగా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకర శర్మ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డాక్టర్ భారతి, డాక్టర్ నేహా పాల్గొన్నారు.

▶నగరంలోని సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఇకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రెడ్డి ప్రస్తావించారు.

రవీంద్ర మహిళ ఇంజనీరింగ్ కాలేజీ, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీల్లో నిర్వహించిన మహిళా దినోత్సవానికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.సరళాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. చదువు ద్వారానే మహిళలు ఎంచుకున్న రంగంలో రాణిస్తారని చెప్పారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, ఈ విద్యా సంస్థల సీఈఓ డా.జి మమతా మోహన్, ఆ కాలేజీల ప్రిన్సిపల్స్ డా.కెతు శ్రీనివాస మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొని ప్రసంగించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

చదువుతోనే జీవితంలో రాణింపు

▶స్థానిక ఏ క్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సింధు సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో స్త్రీ పాత్ర కీలకమైందని, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మైపర్ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

▶క్రియేటివ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫార్మసీ కాలేజీలో జరిగిన వేడుకల్లో వీఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, బీజేపీ అధికార ప్రతినిధి డా.వీనీషారెడ్డి పాల్గొని మాట్లాడారు. కాలేజీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో-ఆర్డినేటర్ డా.నాగ సుధ, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

▶శ్రీశంకరాస్ డిగ్రీ కాలేజీలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మద్దిలేటి పాల్గొని ప్రసంగించారు. సమాజం అభివృద్ధిలో స్త్రీ పాత్ర చాలా కీలకమైందన్నారు.

▶బీ క్యాంపులోని ప్రభుత్వ బీఈడీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో వైస్ ప్రిన్సిపాల్ డా.మధుసూదన్ పాల్గొని మహిళ టీచర్లను సత్కరించారు.

▶ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ కాలేజీ మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి సాధించాలి

కర్నూలు(అగ్రికల్చర్): మహిళలు రాజకీయంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతో ఉందని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవనకొండ విశ్రాంత ఎంపీడీవో గౌరీదేవి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ మంజువాణి, ఎంపీడీవో సుమిత్ర, డాక్టర్ అరుణ, భగవద్గీత గోల్డ్‌మెడలిస్ట్ అరుణ, న్యాయవాది నాగ విజయ తదితరులు పాల్గొన్నారు.

▶కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ, ఐద్వా- శ్రామిక మహిళ సంఘం, సీఐటీయూ కలసి కట్టుగా మహిళా దిన వేడుకలు నిర్వహించాయి. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, ఐద్వా సీనియర్ నాయకురాలు, శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి.నిర్మలమ్మ తదితరులను ఘనంగా సత్కరించారు.

పోరాటాలకు సిద్ధం కండి

కర్నూలు(సెంట్రల్): చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ అమలు కోసం మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాదేవి పిలుపునిచ్చారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సీఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమాఖ్య, సమతా మహిళా విభాగం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి సీఆర్ భవన్ వరకు మహిళలు కోలన్నలతో ప్రదర్శన చేశారు. అనంతరం సీఆర్ భవన్ దగ్గర మహిళా సమాఖ్య పతాకాన్ని దుర్గాదేవి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.శ్రావణి రెడ్డి, నగర కార్యదర్శి యూ.భారతి, సీపీఐ సీనియర్ నాయకులు కె.జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పాల్గొన్నారు.

▶నగరంలోని అమ్మ వృద్ధుల శరణాలయంలో కాంగ్రెస్‌పార్టీ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షురాలు వెంకట సుజాత కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు.

పోలీసు కుటుంబాల మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్యులకు మెమొంటోలు అందజేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపిక పాటిల్

కర్నూలు : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు కుటుంబాల మహిళలకు జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అమీలియో, ఒమెగా హాస్పిటల్ వైద్యులు పోలీసు కుటుంబాల మహిళలు 324 మందికి 2డి ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్, హెచ్‌బీ, కంటి తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, సిబ్బందికి శాలువలతో సత్కరించి మొమెంటోలు అందజేశారు. జిల్లా మహిళలకు ఎస్పీ, కమాండెంట్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డాక్టర్లు లక్ష్మీప్రసాద్, శృతి, రేవతి, విజయలక్ష్మి, విష్ణు చంద్రిక, మునీరా బేగం, పవన్ తేజ, ఆదిత్య, శిల్ప, మార్కెటింగ్ టీమ్ షేక్షావలి, రంజిత్ కుమార్, పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డీఎస్పీలు శ్రీనివాసాచారి, బాబు ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, బాషా, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, మహిళా పోలీసులు, మహిళా హోంగార్డులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట



వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు మంగమ్మ అన్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ నగర కమిటీ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీకి చెందిన పలువురు మహిళలకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మంగమ్మ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారన్నారు. తొమ్మిది నెలలైనా మహిళలకు ఫ్రీ బస్సు, ఆడబిడ్డ నిధి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షులు రాధికమ్మ, సుమలత, స్వర్ణలత, లలితమ్మ, సువర్ణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మైపర్ కాలేజీలో డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రమణ్యంను సన్మానిస్తున్న డా.స్టెల్లా సతీష్



విద్యార్థినికి రూ.10 వేల చెక్ అందజేస్తున్న శ్రీ పతంజలి సాయినాథ్ యోగా ట్రస్ట్ సభ్యులు



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



వీఆర్ హాస్పిటల్ ఎండీని సన్మానిస్తున్న క్రియేటివ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫార్మసీ కాలేజీ సిబ్బంది



మహిళా దినోత్సవంలో రాయల మహిళా సంఘం సభ్యులు, చిన్నారులు

సంక్షిప్తం

నేడు రాజ్యలక్ష్మి పుల్లయ్య పురస్కారం ప్రదానం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సహకారంతో ఆదివారం ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లో పింగళి సూరన తెలుగు తోటలో జగర్లపూడి రాజ్యలక్ష్మి పుల్లయ్య పురస్కార ప్రదానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రంగస్థల కళాకారులకు అభినందన

కర్నూలు కల్చరల్: జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ శనివారం టీజీవీ కళాక్షేత్రంలో నాటకం ప్రాక్టీస్ చేస్తున్న జగదేక సుందరి సామ పద్య నాటక కళాకారులను డీఈఓ శామ్యూల్‌పాల్ అభినందించారు. కళాకారులు పాడిన పద్యాలను విని ప్రశంసించారు. ఆయన సైతం కీబోర్డు, హార్మోనియం వాయించి అందరిని ఆశ్చర్య పరిచారు.

అవాజ్ కమిటీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లా నుంచి అవాజ్ కమిటీ నాయకులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. విజయవాడకు వెళ్లడానికి అనుమతి లేదని గార్గేయపురం దగ్గర వారిని పోలీసులు అడ్డగించారు. దీంతో అవాజ్ కమిటీ నాయకులు ఎస్ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో వారు అక్కడే రోడ్డుపై కూర్చోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అనంతరం వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

అన్న క్యాంటీన్ల తనిఖీ

కర్నూలు (టౌన్): నగరంలోని అన్న క్యాంటీన్లను శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు తనిఖీ చేశారు. స్థానికంగా పాతబస్టాండ్, కలెక్టరేట్ వద్ద అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్ అక్కడ భోజనం తింటునన వారితో మాట్లాడారు. ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతపై ఆరా తీశారు.

అసోసియేషన్ ఆస్తులను కాపాడుకుందాం

కర్నూలు (అగ్రికల్చర్) : ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా బ్రాంచ్‌కి వివిధ తాలూకాల్లో ఉన్న ఆస్తులను పరిరక్షించుకుందామని ఆ సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, ఆర్అండ్‌బీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం తాలూకా కార్యవర్గాలకే ఆస్తులు ఉన్నాయని, ఇవి కూడా దుర్వినియోగమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయ వ్యయాలపై స్పష్టమైన లెక్కలు లేవని, నిధుల వినియోగంపై రాష్ట్ర కార్యవర్గం కూడా దృష్టి సారించిందని తెలిపారు.

మండుటెండలో బతుకుపోరు!



అక్షర జ్ఞానం లేకపోవడం, చిన్న వయస్సులోనే పెళ్లి జరగడం వల్ల ఇప్పటికీ కొందరు మహిళలు అవకాశాలను అందుకోలేకపోతున్నారు. వంటింటి కుందేళ్లుగా, చేతివృత్తులతో కాలం గడుపుతున్నారు. లోకమంతా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటుంటే.. ప్రతి ఒక్కరూ 'ఆమె'ను వేనోళ్ల కీర్తిస్తుంటే.. ఇదిగో ఇలాంటి బడుగుజీవులు ఇప్పటికీ రోడ్లపై 'బతుకు వేట' సాగిస్తున్నారు. మేము నేటి మహిళలం అని కొందరు పురుషాధిక్య సమాజానికి సవాలు విసురుతుంటే, కాళ్లకు చెప్పుల్లేకుండా.. మండుటెండలో చంటిబిడ్డను చంకకెత్తుకుని పొట్ట కూటికి ఈమె నిత్య పోరాటం సాగిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పెద్దాసుపత్రిలో చలివేంద్రాలు ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. శ్రీ సద్గురు దత్త కృపాలయం ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని సూపర్‌స్పెషాలిటీ బ్లాక్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, గైనిక్, ట్రామాకేర్‌లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ సద్గురు దత్త కృపాలయం వారు ఆసుపత్రిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, 23 సంవత్సరాల నుంచి రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. అందులో ప్రతిరోజూ రోగుల సహాయకులకు మధ్యాహ్న భోజనం వెయ్యి మంది వరకు అందించడం అభినందనీయమన్నారు. గతంలో ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కూడా వారు అందించినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, శ్రీ సద్గురు దత్త కృపాలయం వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ మల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్, సెక్రటరి శ్రీధర్ గుప్త, నిర్మల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నగరంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందున ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఈఈ శేషాద్రి, డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. మరమ్మతుల కారణంగా స్టాంటన్‌పురం ఏరియా, సుంకేసుల రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, అశోక్‌నగర్, పెద్ద మార్కెట్ ఏరియా, ఖండేరి వీధి, ఖడక్‌పురా, కొండారెడ్డి బురుజు ఏరియా, కొత్తపేట, కల్లూరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

గౌరీ శంకరునికి అన్నాభిషేకం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకొని గౌరీ శంకరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతః కాల పూజలు, పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకం తదితర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గోదా గోకులం వార్షికోత్సవం



స్వామివారి పుష్పయాగ సేవలో గోదా గోకులం పరివారం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదా దేవి సమేత రంగనాథస్వామి దేవస్థానం రెండవ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు 108 రజత కలశాలతో తిరుమంజనం కార్యక్రమాలు అత్యంత వైభంగా జరిగాయి. అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం పూజా క్రతవు నిర్వహించారు త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామిలు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్, వేములు జనార్దన్, ఇల్లూరు రామయ్య, రామ్‌ప్రసాద్, చిత్రాల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం రేపు మహాధర్నా

కర్నూలు(సెంట్రల్): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇళ్లు లేని వారికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇళ్లు కట్టిస్తానని చెప్పారని, అయితే బడ్జెట్‌లో గృహ నిర్మాణ రంగానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు.

